

నిబద్ధతకు నిలువుటద్దం..
## బన్న ప్రభాకర్

- అలుపెరుగని రాజకీయ ప్రస్థానం
- బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు
- కార్యకర్త స్థాయి నుంచి కీలక నేత వరకు..
- తండ్రి రాజకీయ స్ఫూర్తితో ప్రజా సేవలోకి..
- పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా శిరసావహించే నైజం

7లో..


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 055
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
ఫిబ్రవరి 07, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





- గెలుపే లక్ష్యంగా అడుగులు
- కలిసికట్టుగా పనిచేస్తున్న ముఖ్య నేతలు
- నిత్యం మానిటరింగ్ చేస్తున్న అధిష్టానం
- పాదయాత్రలు, లోకల్ మేనిఫెస్టోలతో ప్రచారంలోకి అభ్యర్థులు

# 'చే' జారొద్దు

## మున్సిపోల్స్ పై కాంగ్రెస్ సీరియస్

వివరాలు2లో..

రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలను కాంగ్రెస్ సీరియస్ గా తీసుకుంది. గెలుపే లక్ష్యంగా అధిష్టానం అడుగులు వేస్తోంది. పార్టీ గుర్తుతో జరుగుతున్న ఈ ఎన్నికల్లో మరోమారు గెలిచి తమ సత్తా చాటాలని భావిస్తున్నారు. రెండు సంవత్సరాల రేవంత్ రెడ్డి పనితీరుకు ఇది రెఫరెండంగా భావిస్తున్నారు. పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం నేతలకు సూచిస్తున్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా ఆవిర్భవించిన తెలంగాణ బీఆర్ఎస్ పాలనలో 10 సంవత్సరాలపాటు దోపిడీకి గురైన విషయాన్ని క్షేత్ర స్థాయిలో అందరికీ తెలిసేలా ప్రచారం చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ రాకముందునుంచే కాంగ్రెస్ ఈ ఎన్నికలపై దృష్టి పెట్టింది. మంత్రులు చైర్మన్లుగా పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా స్క్రీనింగ్ కమిటీలను నియమించింది. పార్టీ విధేయులకు టికెట్లు, టికెట్లు దక్కనివారికి బుజ్జగింపులు, రాబోయే పదవుల్లో వారికే ప్రాధాన్యం ఇస్తామన్న భరోసా కల్పిస్తున్నారు. కాంగ్రెస్ నేతలంతా ఒక్కతాటిపైనే పయనిస్తున్నందున కాంగ్రెస్ కు రెబల్స్ బెడద లేదని అధిష్టానం పెద్దలు చెప్పకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరుగున్న ఎన్నికల్లో ఏ ఒక్క సీటు 'చే' జారొద్దు అన్నట్లుగా కాంగ్రెస్ నేతలు కలిసి కట్టుగా ముందుకు సాగుతున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతిని



## అక్రిడిటేషన్ కార్డులకి ఆహ్వానం

**9 నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తులు**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026–28సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి గడువు ఫిబ్రవరి 28తో ముగియనున్నందున అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను (ఓరిజినల్) జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలన్నారు. యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు మాత్రమే సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఆన్ లైన్ దరఖాస్తులను ఫిబ్రవరి 9 నుంచి సమర్పించాలని, అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

– వరంగల్ వాయిస్, వరంగల్

2లో..




## మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

## ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్ డాక్టర్ సత్య శారద



2లో..

2లో..




## మల వ్యర్థాలు బహిరంగంగా డంప్ చేస్తే కేసులు

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- శానిటేషన్, ఇంజనీరింగ్, హార్టికల్చర్ అధికారులతో సమావేశం

# 'చే'జారొద్దు

- మున్సిపోల్స్ పై కాంగ్రెస్ సీరియస్
- గెలుపే లక్ష్యంగా అడుగులు
- కలిసికట్టుగా పనిచేస్తున్న ముఖ్య నేతలు
- నిత్యం మానిటరింగ్ చేస్తున్న అధిష్టానం
- పాదయాత్రలు, లోకల్ మేనిఫెస్టోలతో ప్రచారంలోకి అభ్యర్థులు




**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు ఈ నెల 11న పోలింగ్ జరుగనున్నాయి. ఇందులో ఏ ఒక్క సీటు చేజారొద్దు అన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అడుగులు వేస్తోంది. మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ రాకముందునుంచే కాంగ్రెస్ ఈ ఎన్నికలపై దృష్టి సారించింది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో రెబల్స్ తోనే పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లిందని అంచనాలో ఉన్న కాంగ్రెస్ నేతలు మున్సిపల్ ఎన్నికలపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. రెబల్స్, అసంతృప్తుల బెడద లేకుండా పక్కా ప్లాన్ ప్రకారం ముందుకు సాగుతున్నారు. మంత్రులు చైర్మన్లుగా పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కమిటీలు ఆధ్వర్యంలోనే పార్టీ విధేయులకు టికెట్లు కేటాయించారు. అయితే టికెట్లు దక్కని వారికి బుజ్జగింపులు, రాబోయే పదవుల్లో వారికే ప్రాధాన్యం ఇస్తామన్న భరోసాతో అసంతృప్తులకు కట్టడి చేశారు.

### అధిష్టానం స్పెషల్ ఫోకస్..

మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించింది. ఎప్పటికప్పుడు పార్టీ అభ్యర్థులతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి రెండుసార్లు నేతలతో జూమ్ మిటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్, డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. తాజాగా పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జులు, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్లుగా ఉన్న మంత్రులతో సీఎం భేటీ నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇది చాలదన్నట్లు జిల్లాల వారీగా పర్యటిస్తూ 10 సంవత్సరాల్లో బీఆర్ఎస్ నేతలు చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు గ్లోబల్ ప్రచారాలు చేసి తిరిగి అధికారంలోకి వచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎండగడుతున్నారు.

### మంత్రులదే బాధ్యత..

మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు బాధ్యతలను మంత్రులకు అప్పగించారు. ఎన్నికలు జరిగే వరకు స్థానికంగా ఉండి విజయ బావుటా ఎగుర వేయాలంటూ అధిష్టానం సూచిస్తోంది. దీంతో కాలికి బట్టకట్టకుండా మంత్రులు పర్యటన సాగిస్తున్నారు. స్థానికంగా ఉంటూ నేతల మధ్య సమన్వయం చేస్తున్నారు. రాజకీయ వ్యూహాలకు పదను పెడుతున్నారు. ఓట్లు చీలకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. స్థానికంగా ఎవైనా సమస్యలు ఎదురైతే ఎప్పటికప్పుడు పీసీసీ చీఫ్ తోపాటు వార్ రూమ్ దృష్టికి తీసుకుపోతున్నారు. దీనికి తోడు రోజు వారి నివేదికలను ముఖ్యమంత్రికి ఇచ్చే బాధ్యతలను కూడా మంత్రులకే కేటాయించడంతో వారు నిత్యం క్షేత్ర స్థాయిలో ఉంటూ ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు.

### నిత్యం ఇంటింటి ప్రచారాలు..

బీఆర్ఎస్, బీజేపీలు అనుసరిస్తున్న ప్రచారాలను గమనిస్తూ వారికి భిన్నంగా ప్రచారాలను కొనసాగించడంలో కాంగ్రెస్ నేతలు ముందుంటున్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు లోకల్ మేనిఫెస్టోలతో పాదయాత్రలు, ఇంటింటి ప్రచారాలు నిర్వహిస్తూ ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ తోపాటు బీజేపీ టార్గెట్ గా విమర్శలు, ఆరోపణలు ఎక్కుపెట్టాలనని క్యాడర్ కు సూచనలు చేస్తున్నారు. గడప గడపకు వెళ్లి రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ నేతలు దోచుకున్న వందల కోట్లతో రాష్ట్రం అప్పులపాలైన విషయాన్ని అందరికీ తెలియచెప్పుతున్నారు. కాంగ్రెస్ గెలిస్తేనే మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతాయన్న నమ్మకాన్ని ప్రజలకు కల్పిస్తున్నారు.



## మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

☐ వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** పకడ్బందీ ఏర్పాట్ల నడుమ మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈనెల 11వ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగామ, స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపాలిటీలకు జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన చర్యలపై సంబందిత పోలీస్ అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఎన్నికల ముందు, ఎన్నికల రోజు, కౌంటింగ్ రోజు చేపట్టనున్న పోలీస్ బందోబస్తు వివరాలను కూడా పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు గాను అక్రమ మద్యం కట్టడి చేయడంతో పాటు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే విధంగా అందించే తాయిలాలపై పోలీస్ అధికారులు నిఘా పెట్టాలన్నారు. ఎవరైనా, ఎక్కడైనా ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసే విధంగా వ్యవహరించే వారి పట్ల కఠినంగా ఉండాలన్నారు. బ్యాలెట్ పత్రాల పంపిణీ, ఎన్నికల రోజున, చివరగా కౌంటింగ్ రోజున పెద్ద సంఖ్యలో బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని, సంబంధిత ఉన్నతాధికారులు ఎన్నికల నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఎన్నికల వేళ ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించే విధంగా పోలీస్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సీపీ తెలిపారు. ఈ సమావేశం డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్రనాయక్, కవిత, ఏఎస్పీలు శుభం, చేతన్, ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రూతో పాటు ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## మల వ్యర్థాలు బహిరంగంగా డంప్ చేస్తే కేసులు

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- శానిటేషన్, ఇంజనీరింగ్, హార్టికల్చర్ అధికారులతో సమావేశం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మల వ్యర్థాలు బహిరంగంగా డంప్ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చూడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో వివిధ విభాగాల అధికారులు, సానిటరీ ఇన్స్పెక్టర్ లు, ఆస్కి ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు కమిషనర్ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డివిజన్ ల వారిగా చెత్త తరలింపు వాహనాల మరమత్తుల సమాచారాన్ని అడిగి తెలుసుకొని స్వచ్ఛ ఆటోలు రోబో వాహనాల రిపేర్లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నిరంతరం వాహనాల రిపేర్లకు గురవుతున్నాయని అందుకు గల ప్రధాన కారణాలను అధికారులు విశ్లేషించాలన్నారు. ఐసిసిసిలో చెత్త తరలింపు వాహనాల సంబంధ అప్ ను ఎప్పటికపుడు అప్డేట్ చేయాలని (నవీకరించాలని),ఇంజనీరింగ్, శానిటేషన్ ఉన్నతాధికారులు సానిటరీ ఇన్స్పెక్టర్ లతో ప్రతి సోమవారం సమావేశం ఏర్పాటు చేసుకొని వాహన మరమ్మత్తుల పై చర్చించి వేగం గా మరమత్తులు పూర్తి చేయాలని, పోతన ట్రాన్స్ ఫర్ స్టేషన్ లో చెత్త ను వేసే, తీసుకెళ్లే వాహనాల నిరీక్షణ (వెయిటింగ్) సమయం తగ్గించేలా చూడాలని,అక్రమం గా మల వ్యర్థాలను బయట డంప్ చేసే సెప్టిక్ ట్యాంక్ వాహన యజమానుల లపై చట్టప్రకారం క్రిమినల్ కేసు లు నమోదు చేసేలా చూడాలని, ముఖ్యం గా సెలవు రోజుల్లో సానిటరీ ఇన్స్పెక్టర్ లు ప్రత్యేక దృష్టి సారించి రెడ్ హ్యాండ్ గా పట్టుకొని క్రిమినల్ కేసు లు నమోదు చేసేలా చూడాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సీహెచ్ఓ రమేష్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈలు మహేందర్, మాధవి లత, డీఈలు రాజ్ కుమార్, సంతోష్ కుమార్, ఆస్కి ప్రతినిధి రాజ్ మోహన్ పాల్గొన్నారు.






## ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

☐ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వర్ధన్నపేట, నర్సంపేట మునిసిపాలిటీలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్లు, సీల్స్, స్టేషనరీ, పోలింగ్‌కు అవసరమైన ఇతర సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ నుంచి పోలింగ్ ముగిసే వరకు ప్రతి దశలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అనుకూలంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, మునిసిపల్ కమిషనర్లు సుధీర్ కుమార్, భాస్కర్, ఆర్డీఓ కార్యాలయ డీఏఓ ఫణి కుమార్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోదాముల పరిశీలన..

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా గోదాములను కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# 'కండ్లు' పోతున్నాయి..

- రాత్రి ప్రయాణం నరకమవుతోంది
- 'ఎల్ఈడీ' వెలుగులతో ప్రమాదాలు
- ఆర్టీవో నిబంధనలు గాలికి..
- పట్టించుకోని అధికార యంత్రాంగం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రాత్రి వేళ రోడ్డుపైకి రావాలంటేనే వాహనదారులు వణికిపోతున్నారు. సూర్యుడు అస్తమించి చీకటి పడిందంటే చాలు.. రహదారులపై మృత్యువు 'ఎల్ఈడీ' కాంతుల రూపంలో ఎదురుచూస్తోంది. రాత్రి 7 గంటల తర్వాత ఎదురుగా వచ్చే వాహనాల హై-బీమ్ ఎల్ఈడీ లైట్ల ధాటికి కళ్లు బైర్లు కమ్మి, రోడ్డు ఏమాత్రం కనిపించని దుస్థితి నెలకొంది. ఈ మిరుమిట్లు గొలిపే కాంతుల వల్ల నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

### నిబంధనల అమలు ఎక్కడ?

గతంలో వాహనాల హెడ్ లైట్లకు సగం వరకు నల్లటి స్టిక్కర్ వేయాలనే నిబంధన ఉండేది. దీనివల్ల కాంతి నేరుగా ఎదుటివారి కళ్లపై పడకుండా ఉండేది. కానీ, ప్రస్తుతం ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. కొత్తగా వస్తున్న వాహనాలన్నీ అత్యంత శక్తివంతమైన ఎల్ఈడీ లైట్లతో వస్తుండటం, వాటిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఎదురుగా వచ్చే తీవ్రమైన వెలుగు వల్ల సెకన్ల పాటు కళ్లు కనిపించవు, ఇది ప్రమాదానికి ప్రధాన కారణం. విచ్చలవిడిగా వాడుతున్న అదనపు లైట్లపై ఆర్టీవో అధికారుల తనిఖీలు శూన్యం. లో-బీమ్ వాడకపోవడం, నిబంధనల పట్ల అవగాహన లేకపోవడంతో సామాన్య ప్రయాణికులు బలైపోతున్నారు.

### రవాణా శాఖ అధికారుల చర్యలేవీ..?

ప్రమాదాల బారి నుంచి ప్రజలను కాపాడాలంటే రవాణా శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని బాధితులు కోరుతున్నారు. పాత నిబంధన ప్రకారం హెడ్ లైట్లపై సగం వరకు బ్లాక్ స్టిక్కర్ లేదా బ్లాక్ పెయింట్ వేయడాన్ని మళ్లీ తప్పనిసరి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే, నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హనుమకొండ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# అక్రిడిటేషన్ ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026–28 సంవత్సరానికి గాను జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ దివాకర టీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల జర్నలిస్టులు ఈ నెల 9 నుంచి ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి ఫిబ్రవరి 28తో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మీడియా యాజమాన్యాలు మొదట తమ సంస్థలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టుల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలి. యాజమాన్యాలు పంపిన జాబితాలో పేరున్న జర్నలిస్టులు మాత్రమే అధికారిక వెబ్‌సైట్ http://ipr.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫిబ్రవరి 9 నుంచి ఆన్‌లైన్ విండో అందుబాటులో ఉంటుందని, జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సకాలంలో దరఖాస్తులు సమర్పించి, కార్డుల పునరుద్ధరణ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది.

# హిమోఫిలియా విద్యార్థులకు వరం

## రూ.4 లక్షల విలువైన మందుల పంపిణీ




**వరంగల్ వాయిస్, వరంగల్:** పరీక్షల సమయంలో హిమోఫిలియా వ్యాధిగ్రస్తులైన విద్యార్థులు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదుర్కోకుండా ఉండేందుకు హిమోఫిలియా సొసైటీ వరంగల్ చాప్టర్ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. హిమోఫిలియా ఫెడరేషన్ సహకారంతో, పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సుమారు 4 లక్షల రూపాయల విలువైన 'యాంటీ హిమోఫిలియా ఫ్యాక్టర్ VIII' ఇంజెక్షన్లను ఉచితంగా పంపిణీ చేశారు. నగరంలోని అభయ హాస్పిటల్‌లో ప్రముఖ వైద్యులు డాక్టర్ వైద్యం గౌతమ్ ఆధ్వర్యంలో శనివారం ఎనిమిది మంది విద్యార్థులకు ఈ అత్యవసర మందులను అందజేశారు. పరీక్షల ఒత్తిడిలో లేదా ప్రయాణ సమయాల్లో విద్యార్థులకు అనుకోకుండా రక్తస్రావం జరిగితే, ఈ ఇంజెక్షన్లు ప్రాణరక్షణగా పనిచేస్తాయని వైద్యులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా హిమోఫిలియా సొసైటీ వరంగల్ చాప్టర్ జనరల్ సెక్రటరీ సుమన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ "నిరుపేద విద్యార్థులకు ఇంత ఖరీదైన ఇంజెక్షన్లు అందేలా చేయడంలో డాక్టర్ వైద్యం గౌతమ్ కీలక పాత్ర పోషించారని కృతజ్ఞతలు తెలిపారు. హిమోఫిలియా వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవాలని, వ్యాధిగ్రస్తులకు సమాజం అండగా ఉండాలని ఈ సందర్భంగా వారు కోరారు. లబ్ధి పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**వరంగల్ వాయిస్, ములుగు:** ములుగు మున్సిపాలిటీకి జరగనున్న మొదటి సాధారణ ఎన్నికల నేపథ్యంలో, ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదులు, సమాచారం కోసం జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టీఎస్ శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు మున్సిపాలిటీలోని మొత్తం 20 కౌన్సిల్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పారదర్శకత కోసం ఇప్పటికే పలు పర్యవేక్షణ బృందాలను రంగంలోకి దించినట్లు పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్, వీడియో సర్వేయలెన్స్ టీమ్స్, ఎంసీఎంసీ, ఎంసీసీ బృందాలను నియమించినట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో ప్రజలను ప్రలోభపెట్టే నగదు, మద్యం, ఉచిత కానుకల పంపిణీ, అక్రమ నగదు రవాణాపై నిరంతరం నిఘా ఉంటుందని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన లేదా ఇతర ప్రభావిత అంశాలు ఎవరి దృష్టికైనా వస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సంబంధిత సమాచారం కోసం కూడా ఈ టోల్ ఫ్రీ నంబర్: 1800 425 7109 ను సంప్రదించవచ్చని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# పారదర్శకంగా కౌంటింగ్ నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



**వరంగల్ వాయిస్, జనగాం/స్టేషన్ ఘన్‌పూర్ :** స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ శనివారం సందర్శించారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కౌంటింగ్ హాల్స్‌లోని వసతులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కౌంటింగ్ టేబుల్స్ అమరిక, విద్యుత్ సరఫరా, తాగునీరు మరియు శౌచాలయ సదుపాయాలు, సీసీటీవీ కెమెరాల నిఘా, కౌంటింగ్ కేంద్రం ప్రవేశ, నిష్క్రమణ మార్గాల భద్రత, కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది నియామకం, వారికి కేటాయించిన విధులపై పర్యవేక్షించారు. తనిఖీ అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో కౌంటింగ్ అనేది అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, మాస్టర్ ట్రైనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్నపై 'కోతుల' దండయాత్ర



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** అడవుల్లో ఉండాల్సిన కోతులు జనావాసాల్లోకి చేరి రైతులకు కన్నీళ్లు మిగులుస్తున్నాయి. "కోతులు అడవులకు వాపస్ పోవడం కాదు.. రోజురోజుకూ పంట పొలాలపై దాడులు పెంచుతున్నాయి" అంటూ రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామంలో శనివారం ఉదయం జరిగిన వానర సైన్యం దాడి రైతుకు కోలుకోలేని దెబ్బ తీసింది. గ్రామానికి చెందిన రైతు నకిర్త రఘుపతి తన ఎకరం పొలంలో మక్కజొన్న పంటను సాగు చేశారు. పంట చేతికొచ్చే తరుణంలో ఉన్న తరుణంలో, శనివారం ఉదయం సుమారు 200 కోతుల గుంపు ఒక్కసారిగా చేనుపై పడింది. గంటల వ్యవధిలోనే ఎకరం విస్తీర్ణంలో ఉన్న మక్కజొన్న కంకులను కోతులు విరిచివేసి, పంటను పూర్తిగా నాశనం చేశాయి. పెట్టుబడి పెట్టి, కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కళ్లముందే నాశనం కావడంతో రఘుపతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ దాడి వల్ల తనకు సుమారు రూ.50 నుంచి 80 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోతున్నాడు. గత కొంతకాలంగా వంగపల్లి, పరిసర గ్రామాల్లో కోతుల బెడద తీవ్రమైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతులను ఊర్ల నుంచి తరలించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# జర్నలిస్ట్ సమ్మయ్యకు 'బెస్ట్ రైటర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం

- సన్మానించిన సిరికొండ మధుసూధనా చారి

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ తాళ్లపల్లి వెంకట సమ్మయ్య గౌడ్ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. 2026వ సంవత్సరానికి గాను ఆయన 'బెస్ట్ రైటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం భూపాలపల్లి మంజూరు నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శాసన మండలి పక్షనేత, మాజీ సభాపతి సిరికొండ మధుసూధనా చారి ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఏసియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రకటించారు. ఈ నెల రెండో వారంలో అకాడమీ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా సమ్మయ్య ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. జర్నలిస్టుగా, రచయితగా రాణిస్తున్న సమ్మయ్య గతంలోనే గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. సమ్మయ్యకి ఈ అవార్డు దక్కడం పట్ల జర్నలిస్ట్ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టులు, ఎడిటర్లు గడ్డం కేశవమూర్తి, రాజేశ్వరరావు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఐజేయు జిల్లా కార్యదర్శి శామంతుల శ్యామ్, ఐజేయు రాష్ట్ర హెల్త్ కార్యదర్శి శ్యామల శ్రీనివాస్, న్యూస్ 10 ఎడిటర్ రామకృష్ణ, నారద సీఈవో జి.శ్రీనివాస్ తదితరులు సమ్మయ్యకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.



# పాకెట్ క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్పాయ్ ను హనుమకొండ సాయిబాబా మందిర ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిర విశేషాలతో రూపొందించిన 2026 నూతన పాకెట్ క్యాలెండర్‌ను కమిషనర్‌కు అందజేసి, ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో నిమ్మల శ్రీనివాస్ మందిరం ద్వారా జరుగుతున్న వివిధ ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల గురించి కమిషనర్‌కు వివరించారు. భక్తుల సౌకర్యార్థం మందిరంలో కల్పిస్తున్న వసతులు, నిత్యం జరిగే అన్నదాన కార్యక్రమాలపై చర్చించారు. సాయిబాబా మందిరాన్ని ఒక గురువారం నాడు కుటుంబ సమేతంగా దర్శించుకోవాలని, బాబా వారి ఆశీస్సులు పొందాలని కమిషనర్‌ను ఆయన సాదరంగా ఆహ్వానించారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, మందిర సేవా కార్యక్రమాలను అభినందించారు.

# ప్రజా పాలనే కాంగ్రెస్ పార్టీకి శ్రీరామరక్ష



**వరంగల్ వాయిస్,పరకాల :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా రంజక పాలన, సంక్షేమ పథకాలే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తాయని యూత్ కాంగ్రెస్ వరంగల్ అర్బన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బొచ్చు కోమల-జెమిని ధీమా వ్యక్తం చేశారు. శనివారం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మడికొండ కవిత చెంగల్ రావు తరపున ఆమె ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. బొచ్చు కోమల వార్డులోని ప్రతి ఇంటికీ తిరుగుతూ, మహిళలతో ముచ్చటించి కాంగ్రెస్ పార్టీ 'చేతి గుర్తు'కే ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఫలాలు అందుతున్నాయని, అందుకే ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపును ఎప్పుడో ఖరారు చేశారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో పరకాల మండల అధ్యక్షుడు, 2వ వార్డు ఇంచార్జ్ కట్కూరి దేవేందర్ రెడ్డి, మరో ఇంచార్జ్ మెట్టుపల్లి రమేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి పాల్గొన్నారు. అలాగే యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద శ్యామ్, పార్టీ నాయకులు బొచ్చు మోహన్, కట్టయ్య, అనంత్, రమేష్, రాజు, వినయ్, చింటూ, సంపత్, మడికొండ లలిత, మహిళలు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతిరూపం రమాబాయి



**వరంగల్ వాయిస్, గణపురం:** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సతీమణి, త్యాగధనురాలు రమాబాయి అంబేద్కర్ 128వ జయంతి వేడుకలు శనివారం ఘనపురం మండల కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, బాబాసాహెబ్ అంబేద్కర్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లినప్పుడు, అన్ని కష్టాలను ఓర్చుకుని కుటుంబ బాధ్యతను మోసిన గొప్ప త్యాగమూర్తి రమాబాయి అని కొనియాడారు. అంబేద్కర్ గారి సామాజిక పోరాటంలో ఆమె అండగా నిలబడటం వల్లే ఆయన దేశానికి దిశానిర్దేశం చేయగలిగారని పేర్కొన్నారు. నేటి తరం మహిళలకు రమాబాయి అంబేద్కర్ గారు ఓర్పు, విధేయత, ఆత్మగౌరవానికి ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు తిక్కసంపత్, ఇంజపెల్లి రవికుమార్, మోరే రాజు, మరుపట్ల రాములు, సామర్ల సంపత్, ఎన్నిండ్ల శ్రీకాంత్, కుమ్మరి రవి, మండల నాయకులు, యువత పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎస్సార్
- రేపు చెల్పూరు శివారులో భారీ సభ



**వరంగల్ వాయిస్,గణపురం :** తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రేపు గణపురం మండలంలో పర్యటించనున్నారు. చెల్పూరు గ్రామ శివారులో ప్రభుత్వం భారీ బహిరంగ సభను నిర్వహించ తలపెట్టిన నేపథ్యంలో, శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్వయంగా సభా స్థలిని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా ఎమ్మెల్యే అధికారులకు కీలక సూచనలు చేశారు. సీఎం హెలికాప్టర్ దిగడానికి ఏర్పాటు చేసిన హెలీప్యాడ్, ప్రధాన వేదిక నిర్మాణ పనులను పరిశీలించారు. సభకు వచ్చే ప్రజల కోసం మంచినీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర వైద్య సదుపాయాలపై అధికారులతో సమీక్షించారు. వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలను పరిశీలించి, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకుని భూపాలపల్లి నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోయేలా ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. "నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలకాలి" అని ఆయన కోరారు.సభకు సమయం తక్కువగా ఉన్నందున మిగిలి ఉన్న పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

# అనాథ చిన్నారుల సేవలో కెనరా బ్యాంక్

## శిశు గృహానికి భారీ విరాళం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరాదరణకు గురైన,యు ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు సేవ చేయడం మానవత్వానికి నిదర్శనమని కెనరా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ కళ్యాణ్ ముఖర్జీ అన్నారు. శనివారం లష్కర్ బజార్‌లోని ప్రత్యేక దత్తత వనరుల కేంద్రం (శిశు గృహ)ను సందర్శించిన ఆయన, బ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో సమకూర్చిన వస్తువులను అందజేశారు. సుమారు 50 వేల రూపాయల విలువైన కింది వస్తువులను శిశు గృహ అవసరాల కోసం అందజేశారు. ఒక బీరువా, మూడు ఊయలలు, రెండు రూమ్ హీటర్లు, ఒక మెడికల్ చెకప్ టేబుల్, 20 మెడిసిన్ స్టోరేజ్ బాక్సులు, రెండు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ ముఖర్జీ మాట్లాడుతూ.. "హృదయంతో చేసే సేవ చిన్నారుల భవిష్యత్తును మారుస్తుంది. 'విద్యా జ్యోతి యోజన' పథకం ద్వారా బాలికల సాధికారతకు కెనరా బ్యాంక్ నిరంతరం తోడ్పాటునందిస్తుంది. రాబోయే రోజుల్లో శిశు గృహకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తాం" అని హామీ ఇచ్చారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ అన్నమనేని అనిల్ చందర్ రావు మాట్లాడుతూ.. బాలల న్యాయ చట్టం-2015 ప్రకారం చిన్నారులకు ఇక్కడ పునరావాసం కల్పిస్తూ, పారదర్శకమైన పద్ధతిలో దత్తత ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ ఇన్చార్జి అధికారి సౌరం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఈ కేంద్రం ద్వారా 229 మంది చిన్నారులను చట్టబద్ధంగా దత్తత ఇచ్చామని, అందులో 11 మంది అమెరికా, ఇటలీ వంటి విదేశీ దేశాలకు వెళ్లడం విశేషమని పేర్కొన్నారు. కెనరా బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ రాకేష్ రోషన్ వర్మ, ఏజీఎంలు శాంతి కుమార్, ఉష, మేనేజర్ బండి శివ కుమార్, శిశు గృహ ఇంచార్జి మేనేజర్ అనుముల మాధవి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు.

# బాల్యం బుగ్గిపాలు కావొద్దు.. చదువే మీ భవిష్యత్తు



**వరంగల్, పర్వతగిరి :** బాల్య వివాహాలు మరియు బాలకార్మిక వ్యవస్థ అనే సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజ్వలా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో పర్వతగిరి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలు, బాలకార్మిక నిర్మూలన, జువెనల్ జస్టిస్ యాక్ట్, పోష్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫంక్షన్ హాల్ నిర్వాహకులు, పూజారులు, మత పెద్దలు పెళ్లిళ్లు చేసేముందు వధూవరుల బర్త్ సర్టిఫికేట్లను తనిఖీ చేసి, వయస్సును నిర్ధారించుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలని సూచించారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం వల్ల బాలికల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, వారి విద్యావకాశాలు మూతపడి ఆర్థిక ఇబ్బందులకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు 'పోష్ చట్టం-2013'పై అవగాహన కల్పిస్తూ, పని ప్రదేశాల్లో మహిళలకు ఎదురయ్యే ఇబ్బందులను చట్టపరంగా ఎలా ఎదుర్కోవాలో వివరించారు. "బాల్యం అనేది జీవితానికి పునాది. దానిని వివాహాల పేరుతో బుగ్గిపాలు చేసుకోవద్దు. చట్టరీత్యా ఇది నేరమన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సలీమా, వర్షిణి, సుజాత, ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ద్రోహులకు బుద్ధి చెప్పండి

- బీసీ హక్కుల సాధన సమితి పిలుపు



**వరంగల్ వాయిస్, వరంగల్:** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు అన్యాయం చేస్తున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. శనివారం వరంగల్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, నాయకులు చంద్రశేఖర్, చెరుకల రాజు, నారాయణలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల పోరాట ఫలితంగా వచ్చిన 42 శాతం రిజర్వేషన్ల జీవోను కోర్టుకు వెళ్లి అడ్డుకున్న 'రెడ్డి జాగృతి' సంస్థ నేత బుట్టెంగారి మాధవరెడ్డికి బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడంపై వెంకట్రాములు తీవ్రంగా మండిపడ్డారు. మేడ్చల్ జిల్లా చింతలపల్లి మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ఆయనకు బీ-ఫామ్ ఇవ్వడం ద్వారా బిఆర్ఎస్ పార్టీ తన బీసీ వ్యతిరేక నైజాన్ని బయటపెట్టుకుందని ధ్వజమెత్తారు. గతంలో 33శాతం ఉన్న రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించడమే కాకుండా, ఇప్పుడు రిజర్వేషన్లను అడ్డుకున్న వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. అడగకముందే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తెచ్చిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర అసెంబ్లీ పంపిన బీసీ బిల్లులను మాత్రం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా ద్రోహం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రకటించిన 'కామారెడ్డి డిక్లరేషన్' హామీలను అమలు చేయడంలో, బడ్జెట్ కేటాయింపుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను విస్మరిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటూ, పదవులన్నీ అగ్రవర్ణాలకు కట్టబెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో మద్యం, డబ్బు వంటి ప్రలోభాలకు లొంగకుండా ఉండాలి. బీసీ వ్యతిరేక పార్టీల అభ్యర్థులను ఓడించాలి. జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను, ప్రజాస్వామ్య శక్తులను గెలిపించాలని కోరారు. బీసీలు చైతన్యవంతులై తమ రాజకీయ హక్కులను కాపాడుకోవాలని ఈ సందర్భంగా వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ గెలుపుతోనే ఘన్‌పూర్ అభివృద్ధి

■ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్‌పూర్:** ఘన్‌పూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే అది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, ప్రభుత్వ సహకారం లేకుండా ఏ ఒక్క పని చేయలేమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన 16, 17, 18 వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలకు ప్రజలు భారీగా తరలివచ్చారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే జనవరి 2025లో ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా చేశానని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఇప్పటికే ₹50 కోట్ల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. ఇప్పటికే రూ.25 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశామని.. టౌన్ హాల్, లైబ్రరీ, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే, ప్రతి వార్డుకు ₹2 కోట్ల అభివృద్ధి నిధులు కేటాయించడంతో పాటు, అర్హులైన వారికి 40 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. 15 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి నియోజకవర్గాన్ని ఏనాడూ పట్టించుకోలేదని మాజీ ఎమ్మెల్యే రాజయ్యను ఉద్దేశించి కడియం శ్రీహరి విమర్శలు గుప్పించారు."సోయి లేకుండా తాగి, ఊగుతూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడటం తప్ప రాజయ్య చేసిందేమీ లేదు. అధికారంలో ఉన్నప్పుడే చేయనివాడు ఇప్పుడు ఏం చేస్తాడు? ప్రభుత్వంలో లేని వారికి, అభివృద్ధి చేయలేని వారికి ఓటు వేసి నష్టపోవద్దు" అని ప్రజలను కోరారు. ప్రభుత్వ సహకారం, ఎంపీ, ఎమ్మెల్యేల మద్దతు లేకుండా ఒక్క రూపాయి నిధులు కూడా రావని, అందుకే మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మీరు గెలిపిస్తే మీ వార్డులను అభివృద్ధి చేసే పూర్తి బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, వార్డు ఇన్‌చార్జులు, పరిశీలకులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## బీజేపీకి అవకాశం ఇవ్వండి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేయడంలో పోటీ పడుతున్నాయని, ఆ రెండు పార్టీలు అవినీతిలో కూరుకుపోయాయని హనుమకొండ బీజేపీ మాజీ ఎమ్మెల్యే మార్తనేని ధర్మారావు విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన డోర్నకల్ పట్టణంలో పర్యటించి, బీజేపీ అభ్యర్థుల తరపున ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ, కేసీఆర్ మధ్య ఒప్పందం కుదరడం వల్లే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అగ్రనేతలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కానీ, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కానీ రాష్ట్రానికి, ముఖ్యంగా డోర్నకల్ పట్టణానికి జరిగిన మేలు ఏమీ లేదని మండిపడ్డారు. కేవలం కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంతోనే తెలంగాణాలోని పట్టణాల అభివృద్ధి సాధ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న డోర్నకల్ రూపురేఖలు మారాలంటే ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లపు వెంకటేశ్వర్లు, కార్యదర్శి అశోక్ నాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు లక్కన్ వ్యాస్, నరేష్ నాయక్, దేవిక శంకర్ నాయక్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు రెహమాన్, మండలాధ్యక్షులు గణేష్ నాయక్, బాసాని నగేష్, పండర్ లడ్డా, నేతికొప్పల సురేష్, పార్వతి జానయ్య నాయక్, మైను పాషా, కాలా నరేష్ జైన్, హనుమంతు, సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో 'స్కామ్'లే తప్ప.. 'స్కీమ్'లు లేవు



**వరంగల్ వాయిస్, పరకాల/దామెర :** మున్సిపల్ ఎన్నికల వేళ పరకాలలో రాజకీయ వాతావరణం సెగలు రేపుతోంది. బీఆర్ఎస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. శనివారం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి బండారి కవిత–కృష్ణ మద్దతుగా ఆయన వార్డులో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ 'కారు గుర్తు'కే ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చల్లా ధర్మారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కేవలం స్కామ్‌లే జరిగాయని, ప్రజలకు ఉపయోగపడే కొత్త స్కీమ్‌లు ఒక్కటి కూడా తీసుకురాలేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీల పేరుతో ఆశ చూపి ప్రజలను ఓట్లు అడిగిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ప్రజలను పూర్తిగా మోసం చేసిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ రెండు కలిపి తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. వార్డు అభివృద్ధి చెందాలన్నా, గతంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు కొనసాగాలన్నా బండారి కవిత–కృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుండే బీఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో దమ్మన్నపేట సర్పంచ్ నవీన్, వార్డు నాయకులు రాజేష్, గణపతి రెడ్డి, ఉమ, రసూల్ నాగరాజు, తిరుపతి పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థులకు అండగా శ్రీరామ్ ఫౌండేషన్

◆ ఊరుగొండలో స్టడీ మెటీరియల్ పంపిణీ



**వరంగల్ వాయిస్, దామెర :** పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో అండగా నిలిచేందుకు శ్రీరామ్ ఫౌండేషన్ మరో ముందడుగు వేసింది. శనివారం దామెర మండలం ఊరుగొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ చైర్మన్ గురిజాల శ్రీరామ్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురిజాల శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టణ ప్రాంత విద్యార్థులకు ఏమాత్రం తీసిపోరని, వారికి సరైన వనరులు కల్పిస్తే అద్భుతాలు సాధిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి అనేది విద్యార్థుల జీవితంలో అతి ముఖ్యమైన మలుపు అని, ఈ సమయంలో ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు తమ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులోనూ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వేల్పుల రాజ్ కుమార్, గండు ముఖేష్, దామసాని మనోజ్, గండు పరుశురాం, కిరణ్, సుధాకర్ పాల్గొన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు గణపతి, విజయ ప్రభ, అనిత, వసుంధర, సౌజన్య, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని మద్దులపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారుల చేత అక్షరాలు దిద్దించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరిత మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను గ్రామస్థులు ఉపయోగించుకోవాలని కోరారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న బలవర్ధకమైన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. చిన్న వయసులోనే అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లలకు చదువుపై ఆసక్తి పెరుగుతుందని, ఇది వారి భవిష్యత్తుకు బలమైన పునాదిగా మారుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుచరిత, శ్రీకళతో పాటు హెచ్‌ఈవో నాగరాజు, ఏఎన్ఎం విజయ, ఆశా కార్యకర్త స్వరూప, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో విజయం సాధించండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ఆందోళన చెందకుండా ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోగు అశోక్, డాక్టర్ శ్రీలత పిలుపునిచ్చారు. వరంగల్ నగరంలోని నరేంద్ర నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడి బడి)లో శనివారం పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'మోటివేషనల్ కౌన్సిలింగ్ సెషన్' నిర్వహించారు. ఈ సందర్భంగా పోగు అశోక్, డాక్టర్ శ్రీలతలు విద్యార్థులకు పలు మానసిక అంశాలపై అవగాహన కల్పించి వారిలో ఉత్తేజాన్ని నింపారు. పరీక్షల పట్ల భయాన్ని వదిలేసి, 'నేను సాధించగలను' అనే సానుకూల ఆలోచనలతో చదవాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని, నిరంతరం చదవడం కంటే మధ్య మధ్యలో చిన్న విరామాలు తీసుకోవడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. ఈ కీలక సమయంలో జంక్ ఫుడ్, ఆయిల్ ఫుడ్‌కు దూరంగా ఉండి, సులభంగా జీర్ణమయ్యే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులలో పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి ఇలాంటి కౌన్సిలింగ్ సెషన్లు ఎంతో దోహదపడతాయని అన్నారు. నిపుణుల సూచనలతో విద్యార్థులు మరింత ఉత్సాహంగా పరీక్షలకు సిద్ధమవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు మున్సిపాలిటీకి జరగనున్న ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జనరల్ అబ్జర్వర్ ఈ.గంగాధర్ సమక్షంలో పోలింగ్ సిబ్బందికి సంబంధించిన రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం టి–పోల్ పోర్టల్ ద్వారా కంప్యూటర్ ఆధారిత ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ ప్రక్రియ ద్వారా 24 మంది ప్రిసైడింగ్ అధికారులు, 24 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 72 మంది ఇతర పోలింగ్ అధికారులు విధులను ఖరారు చేశారు. ములుగు మున్సిపాలిటీలోని 20 వార్డులకు గాను మొత్తం 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ వివరించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జనరల్ అబ్జర్వర్ గంగాధర్ పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ రమేష్, జిల్లా ఈడీఎం దేవేందర్, ఇతర ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# ఆస్తి కోసం సవతి తల్లిపై హత్యాయత్నం

## నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** భూమి కోసం కన్న పినతల్లిని (సవతి తల్లి) అత్యంత పాశవికంగా హతమార్చాలని చూసిన నిందితుడిని ఆత్మకూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఆత్మకూరు సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం ఈ కేసు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన సంగే రాజీవ్, తన పినతల్లి సంగే ఈశ్వర (శారద)కు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సంక్రమించిన భూమిలో 15 గుంటల స్థలం తనకు ఇవ్వాలని గత కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఆమె నిరాకరించడంతో, ఎలాగైనా ఆమెను వదిలించుకోవాలని రాజీవ్ పథకం వేశాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈశ్వర తలుపు తీస్తుండగా, రాజీవ్ వెనుక నుండి వచ్చి మంచం నవారు పట్టే (నైలాన్ తాడు)తో ఆమె మెడకు గట్టిగా బిగించాడు. మెడకు ఉచ్చు బిగించడంతో ఈశ్వర ముక్కు నుండి రక్తం కారి స్పృహ కోల్పోయి కింద పడిపోయింది. ఆమె చనిపోయిందని భావించిన రాజీవ్, తాడును అక్కడే దాచి పరారయ్యాడు. స్థానికులు గమనించి వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతున్నారు. బాధితురాలి భర్త మొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై లోతుగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితుడు రాజీవ్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఆస్తి గొడవల కారణంగా సొంత కుటుంబ సభ్యులపైనే ఇలాంటి దాడులకు పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది.

# పైడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో తనిఖీ

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడవ డివిజన్ ఎంపీపీ ఎస్ పైడిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం వరంగల్ జిల్లా పానెల్ ఇన్‌స్పెక్షన్ టీం-1 సభ్యులు సందర్శించారు. నోడల్ అధికారి బాలవద్దిరాజు, సభ్యులు తాబేలు శ్రీధర్ గౌడ్, బాసని రాయపరెడ్డిలతో కూడిన బృందం పాఠశాలలోని అకాడమిక్, అడ్మినిస్ట్రేషన్ అంశాలను నిశితంగా పరిశీలించింది. పాఠశాలలోని అన్ని రకాల రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేసిన అధికారులు, ఎఫ్.ఎల్.ఎస్ పై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన కల్పించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి సామర్థ్యాలను మెరుగుపరచాలని కోరారు. గణిత బోధనలో తక్కువ ఖర్చుతో కూడిన బోధనోపకరణాలను విరివిగా ఉపయోగించాలని సూచించారు. మూడవ తరగతి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా విద్యార్థులందరూ 100 శాతం ప్రగతి సాధించేలా కృషి చేయాలని అధికారుల బృందం పిలుపునిచ్చింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.దస్రు, ఉపాధ్యాయులు వై.కృష్ణమూర్తి, జి.శ్రీను, ఎం.వసంత, పద్మ, అనిత, సుమతి తదితరులు పాల్గొన్నారు.

# 'చదువుకో తెలంగాణ' పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా మార్చే లక్ష్యంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేపట్టిన "చదువుకో తెలంగాణ" కార్యక్రమం అభినందనీయమని హనుమకొండ మండల విద్యాధికారి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, విద్యార్థుల్లో విద్యపై అవగాహన పెంచడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని, గొప్ప లక్ష్యాలను పెంపొందించడం ఒక గొప్ప సామాజిక సేవ అని కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోసెస్ మాట్లాడుతూ, 'చదువు' అనే ఆయుధంతో తెలంగాణ భవిష్యత్తును నిర్మించడంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పోషిస్తున్న పాత్ర స్ఫూర్తిదాయకమని కితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న వరంగల్ జోన్ డీజీఎం పి.వి.లక్ష్మణ్, హనుమకొండ సీనియర్ డీఎం రాజేందర్, వరంగల్ సీనియర్ డీఎం వరప్రసాద్, హనుమకొండ బ్రాంచ్ సీనియర్ బీఎం నరేష్ లను అధికారులు అభినందించారు. అలాగే కంపెనీ డీఓలు కుమారస్వామి, వెంకటేశ్వర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లవి మోడల్ స్కూల్లో ఉన్నతాధికారుల తనిఖీ

- ఫ్రాంచైజ్ హెడ్ నిధి పాండే పరిశీలన
- విద్యార్థుల ప్రతిభ, క్రమశిక్షణపై ప్రశంసల జల్లు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ప్రముఖ విద్యాసంస్థ 'పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్' ఫ్రాంచైజ్ అయిన పల్లవి మోడల్ స్కూల్ – అన్నారం బ్రాంచ్ శనివారం ఆ గ్రూప్ ఉన్నతాధికారుల సందర్శనతో సందడిగా మారింది. స్కూల్‌లో అమలవుతున్న విద్యా విధానం, నాణ్యతను పరిశీలించేందుకు పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఫ్రాంచైజ్ హెడ్ శ్రీమతి నిధి పాండే ఆచార్య, అకడెమిక్ కోఆర్డినేటర్ కిషోర్లు విచ్చేశారు. ఈ సందర్శనలో భాగంగా అధికారులు పాఠశాలలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా గమనించారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు అవలంబిస్తున్న ఆధునిక బోధనా పద్ధతులు, వారి నిబద్ధతను అధికారులు అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన అకడెమిక్, కో-కరిక్యులర్ ఆక్టివిటీస్,సాంస్కృతిక కార్యక్రమాలు అధికారులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లోని ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పల్లవి స్కూల్ నిర్దేశించిన ఉన్నత ప్రమాణాలకు నిదర్శనమని నిధి పాండే కొనియాడారు. ఉపాధ్యాయులకు,విద్యార్థులకు మార్గదర్శకత్వం చేస్తూ, కేవలం చదువు మాత్రమే కాకుండా విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యే అసలైన అభివృద్ధి అని అధికారులు పేర్కొన్నారు. అన్నారం బ్రాంచ్‌కు పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నుండి అవసరమైన అకడెమిక్ శిక్షణ, సహకారం నిరంతరం అందుతాయని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్శన తమ స్కూల్ సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపిందని యాజమాన్యం తెలిపింది. పల్లవి గ్రూప్ మార్గదర్శకత్వంలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని పల్లవి మోడల్ స్కూల్ ఛైర్మన్ రాచకొండ అశోక్ చారి, కరెస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలి

## ఎమ్మెల్సీ మధుసూదనాచారి, చల్లా ధర్మారెడ్డి

## 9న పరకాలకు కేటీఆర్ రాక



**వరంగల్ వాయిస్, పరకాల :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పరకాలలో రాజకీయ వేడి పతాక స్థాయికి చేరింది. శనివారం పరకాలలోని లలిత కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ, తెలంగాణ తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను వంచించి గద్దెనెక్కారని, ఈ రెండున్నరేళ్లలో పరకాలకు చేసిన ఒక్క శాశ్వత పనిని చూపాలని డిమాండ్ చేశారు. గతంలో సమస్యల వలయంగా ఉన్న పరకాలను కేసీఆర్ నాయకత్వంలో, చల్లా ధర్మారెడ్డి కృషితో వంద పడకల ఆసుపత్రి, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు, సెంట్రల్ లైటింగ్ వంటి మౌలిక వసతులతో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. అభివృద్ధి అంటే గత ప్రభుత్వం మంజూరు చేసిన పనుల శిలాఫలకాలను మార్చడం కాదని, కొత్తగా ఏదైనా చేసి చూపిస్తేనే ప్రజలు ఆదరిస్తారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని మించిన మోసగాడు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అని, రెండున్నరేళ్లలో పరకాల అభివృద్ధికి ఒక్క రూపాయి అయినా తెచ్చారా? అని ప్రశ్నించారు. ఏ వార్డుకు వెళ్లినా ప్రజలు కేసీఆర్ అందించిన ఫలాలనే తలుచుకుంటున్నారని, 13న విడుదలయ్యే ఫలితాలు కాంగ్రెస్‌కు కనువిప్పు కలిగిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 9న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరకాలకు రానున్నట్లు చల్లా ధర్మారెడ్డి ప్రకటించారు. "బస్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి కేటీఆర్ ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాధాన్యత రంగాలకు మొండిచేయి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆర్థిక సుస్థిరతకు, దీర్ఘకాలిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ.. సామాన్యుడికి కీలకమైన ప్రాధాన్యతా రంగాలను విస్మరించిందని కాకతీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ తిరుణహరి శేషు అభిప్రాయపడ్డారు. హనుమకొండలోని పింగిళీ మహిళా డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం 'కేంద్ర బడ్జెట్ – విశ్లేషణ' అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యంతో తయారీ, సాంకేతిక రంగాలకు ప్రాధాన్యతనిచ్చిన ప్రభుత్వం.. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న తక్షణ సవాళ్లను విస్మరించిందని విమర్శించారు. ఒక్క రక్షణ రంగానికే 15 శాతం నిధులు కేటాయించిన కేంద్రం, దేశాభివృద్ధికి చోదక శక్తులైన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య మరియు వైద్య రంగాలకు కలిపి కేవలం 11 శాతం (సుమారు 6 లక్షల కోట్లు) మాత్రమే కేటాయించడం శోచనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రమౌళి మాట్లాడుతూ, బడ్జెట్‌లోని కొన్ని సానుకూల అంశాలను వివరించారు. నేషనల్ సెమీ కండక్టర్ మిషన్, హై స్పీడ్ రైల్ కారిడార్లు, కంటైనర్ మ్యానుఫ్యాక్చరింగ్ వంటివి భవిష్యత్తు అభివృద్ధికి పునాదులు వేస్తాయని తెలిపారు. ఈ విశ్లేషణాత్మక కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగం అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొని బడ్జెట్‌లోని వివిధ అంశాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# 12న సమ్మెతో కేంద్రం దిగిరావాలి




**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో ప్రభుత్వం దిగిరావాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. శనివారం ఖిలా వరంగల్ చమన్ సెంటర్ వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.దేశ కార్మిక వర్గానికి గొడ్డలిపెట్టుగా మారిన నాలుగు లేబర్ కోడ్స్ రాజ్యాంగ విరుద్ధమని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ కూలీల హక్కులను కాలరాస్తూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి, దాని స్థానంలో 'వీబీ జి రాంజీ'పేరుతో కొత్త స్కీమును తీసుకురావడం వ్యవసాయ కూలీలకు చేసే ద్రోహమన్నారు. పార్లమెంటులో విత్తన బిల్లును ఆమోదించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తుల పరం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాద శక్తుల ముందు మోకరిల్లుతూ దేశ ప్రయోజనాలను పణంగా పెడుతోందని ఆరోపించారు. ఈ డిమాండ్ల సాధన కోసం కోట్లాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలపాలని, ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే నిరవధిక సమ్మెకు కూడా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ వరంగల్ జిల్లా అధ్యక్షులు అర్షం అశోక్, జిల్లా నాయకులు కర్ణాకర్, సతీష్, ఆలిండియా యునైటెడ్ కిసాన్ సభ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, ఉపాధ్యక్షులు మైదం పాణి, నాయకులు సదానందం, భాస్కర్, వెంకటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet


శనివారం, ఫిబ్రవరి 07, 2026



# నిబద్ధతకు నిలువుటద్దం బన్న ప్రభాకర్



**రాజకీయాలంటే కేవలం పదవులు, అధికార కాంక్ష మాత్రమే కాదు.. అదొక నిరంతర ప్రజా సేవ, సిద్ధాంతం పట్ల అంకితభావం అని నిరూపిస్తున్నారు బన్న ప్రభాకర్. సుమారు మూడు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీ జెండాను భుజానకెత్తుకుని, కష్టనష్టాలకు ఓర్చి, సామాన్య కార్యకర్త స్థాయి నుంచి నేడు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం అసాధారణం. జైలు శిక్షలు, కోర్టు కేసులు, ఎన్నో ఓటములు ఎదురైనా.. వెనకడుగు వేయని నైజం ఆయనది. 'దేశం కోసం.. ధర్మం కోసం' అనే నినాదాన్ని గుండెల్లో నింపుకుని, ప్రజా క్షేత్రంలో నిరంతరం పోరాడుతున్న ప్రభాకర్ జీవితం, నేటి తరం యువ రాజకీయ నాయకులకు ఒక దిక్సూచిలా నిలుస్తోంది.**



గడ్డం కేశవమూర్తి

- అలుపెరుగని రాజకీయ ప్రస్థానం
- బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు
- కార్యకర్త స్థాయి నుంచి కీలక నేత వరకు..
- తండ్రి రాజకీయ స్ఫూర్తితో ప్రజా సేవలోకి..
- పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా శిరసావహించే నైజం



నమ్మిన సిద్ధాంతం కోసం దశాబ్దాలుగా పార్టీ జెండాను భుజాన మోస్తున్న నిబద్ధత గల నాయకుడు బన్న ప్రభాకర్. సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి, నేడు భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రభాకర్ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభాకర్ ఎన్నడూ వెనకడుగు వేయలేదు. ఎన్నికల్లో ఓటములు ఎదురైనా, ఆశించిన సమయంలో అసెంబ్లీ టికెట్ రాకపోయినా.. క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేశారు. "పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా శిరసావహించడమే నాకు తెలుసు. పదవుల కంటే దేశం, ధర్మం కోసం పనిచేయడమే లక్ష్యంగా ఆయన పనిచుస్తున్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజాక్షేత్రంలో ముందుకు సాగుతున్నారు.

## కుటుంబ నేపథ్యం - విద్యాభ్యాసం

ఖిలా వరంగల్ మండలం నక్కలపల్లికి చెందిన బన్న స్వామి, సమ్మక్క దంపతుల కుమారుడు ప్రభాకర్. తన తండ్రి స్వామి నక్కలపల్లి గ్రామ ఉపసర్పంచ్‌గా, ఎన్టీఆర్ హయాంలో టీడీపీ నాయకుడిగా ప్రజా సేవలో ఉండేవారు. తండ్రి అడుగుజాడల్లోనే ప్రభాకర్ చిన్నతనం నుంచే రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. నక్కలపల్లి, రక్షాయిపేటలలో పాఠశాల విద్యను పూర్తి చేసిన ఆయన, హనుమకొండలోని మహబూబియా పంజాతన్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుకున్నారు. విద్యార్థి దశలోనే ఎన్‌సీసీ లో రాణించి, పరేడ్‌లో తన ప్రతిభను చాటడమే కాకుండా, మంచి కబడ్డీ క్రీడాకారుడిగా కూడా గుర్తింపు పొందారు.

## రాజకీయ ప్రస్థానం..

1994లో ఓటు హక్కు రాకముందే రాజకీయ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్న ప్రభాకర్, 1999లో మార్తినేని ధర్మారావు నాయకత్వంలో అధికారికంగా బీజేపీలో చేరారు. అప్పటి నుంచి పార్టీ నిర్మించిన ప్రతి అడుగులోనూ భాగస్వామి అయ్యారు. నక్కలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా ప్రారంభించి.. మండల ఉపాధ్యక్షుడిగా, వర్ధన్నపేట అసెంబ్లీ కన్వీనర్‌గా, జోనల్ ఇంచార్జిగా వివిధ స్థాయిల్లో పనిచేశారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, పార్టీ అధికార ప్రతినిధిగా, దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేశారు.

## పోరాటాలే ఊపిరిగా..

బన్న ప్రభాకర్ రాజకీయ ప్రస్థానంలో పదవుల కంటే ప్రజా పోరాటాలకే అగ్రపీఠం. సమస్య ఎక్కడ ఉంటే అక్కడ ప్రభాకర్ గళం వినిపిస్తుంది. నిరంతరం ప్రజల పక్షాన నిలబడటమే ఆయనపై నమోదైన 14 క్రిమినల్ కేసుల వెనుక ఉన్న అసలు రహస్యం. కరెంటు కష్టాలతో అల్లాడుతున్న రైతన్నల కోసం తిమ్మాపురం సబ్–స్టేషన్‌ను ముట్టడించి, ప్రభుత్వ మొండివైఖరిని ఎండగట్టారు. ఆ సందర్భంలో జరిగిన ఉద్రిక్తతల్లో కేసులు నమోదైనా వెనక్కి తగ్గలేదు. గ్రామాల్లో చిచ్చు పెడుతున్న గుడుంబా రక్కసిని తరిమికొట్టేందుకు ఎక్సైజ్ కార్యాలయంపై దాడి చేసి, సామాజిక హితం కోసం జైలుకు వెళ్లారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని హెడ్ క్వార్టర్స్ ముట్టడి, కలెక్టరేట్ ముట్టడి వంటి కార్యక్రమాల్లో ముందుండి ఫర్నిచర్ ధ్వంసం వంటి కేసులను సైతం ఎదుర్కొన్నారు. ఉద్యమ కాలంలో ఎక్కువగా జైలు జీవితం గడిపిన సందర్భాలు ఉన్నాయి.





## దేశం కోసం.. ధర్మం కోసం..

బన్న ప్రభాకర్ రాజకీయ ప్రస్థానం కేవలం పదవుల చుట్టూ తిరిగేది కాదు, అది ఒక ఆశయ సాధన. ఏనాడూ తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాకులాడకుండా, నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడటమే ఆయన ప్రత్యేకత. "భారతీయ జనసంఘ్ స్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు, భారతరత్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో నీతి, నిజాయితీతో కూడిన రాజకీయాలు చేయడమే నా ఏకైక లక్ష్యం" అని ప్రభాకర్ స్పష్టం చేస్తారు. రాజ్యాంగబద్ధమైన విలువలు, ధర్మ రక్షణే తన బాధ్యతని ఆయన నమ్ముతారు. తాజాగా పార్టీ ఆయనను వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో, ఆ బాధ్యతను ఒక సవాల్‌గా స్వీకరించారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్నప్పటికీ, ప్రభాకర్ నేటికీ సామాన్యుడిలాగే జీవిస్తున్నారు. తన భార్య రజిత, కుమారులు ధర్మేంద్ర, జయేంద్రలతో కలిసి నిరాడంబర జీవితం గడుపుతూ, నిరంతరం ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. ప్రజల చెంతనే ఉంటూ, వారి సమస్యల కోసం గళమెత్తడమే తన నిత్యకృత్యంగా మార్చుకున్నారు.







## ఓటమిలోనూ చెదరని ధైర్యం..

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. కానీ, ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోకుండా, మరింత పట్టుదలతో ప్రజాక్షేత్రంలో నిలిచే నాయకులు అరుదుగా ఉంటారు. ఆ అరుదైన కోవకే చెందిన వారు బన్న ప్రభాకర్. ఆయన రాజకీయ ప్రయాణంలో ఎదురుదెబ్బలు తగిలినా, అడుగు మాత్రం తడబడలేదు. 2004లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కేవలం 4 ఓట్ల స్వల్ప తేడాతో విజయం చేజారినా, ఆయన ఏనాడూ నిరాశ చెందలేదు. 2006లో జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి ఏకంగా 6,000 ఓట్లు సాధించి తన సత్తా చాటారు. ఆ ఎన్నికల్లో ప్రత్యర్థి బలమైన కూటమి (బీఆర్ఎస్–కాంగ్రెస్ కూటమి) అభ్యర్థి అయినప్పటికీ, ప్రభాకర్ గట్టి పోటీని ఇచ్చి రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచారు. 2016 జీడబ్ల్యూఎంసీ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆయన భార్య బన్న రజిత 43వ డివిజన్ నుంచి పోటీ చేసి తృటిలో విజయాన్ని కోల్పోయారు. అయినప్పటికీ, ఆ కుటుంబం పార్టీ జెండాను వదలలేదు. రెండు సార్లు అసెంబ్లీ టికెట్ ఆశించినప్పటికీ, పార్టీ వ్యూహాల్లో భాగంగా అది దక్కలేదు. సామాన్య నాయకులైతే ఇలాంటి సమయంలో తిరుగుబాటు చేస్తారు, కానీ ప్రభాకర్ మాత్రం క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు శ్రమించారు.



# పన్నులు పెంచే కాంగ్రెస్ కావాలా ?


- కేంద్రనిధులతో అభివృద్ధి చేసే బీజేపీ కావాలా ?
- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మీకు పన్నులు పెంచి పీల్చి పిప్పిచేసే కాంగ్రెస్ కావాలా.. కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేసే బీజేపీ కావాలా అని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ప్రశ్నించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్ఎస్ తండా 5వ వార్డు బీజేపీ అభ్యర్థి బానోతు విజయ్ సంపత్ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ గారి నేతృత్వంలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ బూటకపు మాటలు, హామీలకు లొంగకుండా వారికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మాజీ మేయర్ టి.రాజేశ్వర రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, ఎన్నికల కో-కన్వీనర్లు మల్లాడి తిరుపతిరెడ్డి, ముత్తిరెడ్డి కేశవరెడ్డి, 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పనా నవీన్ కుమార్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, మహిళ నాయకురాలు మంజుల రెడ్డి, వార్డ్ ఇన్చార్జులు అడుప రాజు, మాదాసు రాజు, రాయపూరం రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసి ఓట్లు అడగండి

- బంజారా సమాజానికి ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్ రెడ్డి

**వరంగల్ వాయిస్, మరిపెడ :** దమ్ముంటే బీఆర్ఎస్ చేసినట్లు అభివృద్ధి చేసి ఓట్లు అడగాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మరిపెడ మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జి ఏనుగుల రాకేష్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే రాంచద్ర నాయక్ కు సవాల్ విసిరారు. సూర్యాపేట నుంచి వచ్చి ఇక్కడ గిరిజన బిడ్డలపై దాడి చేస్తున్న ఆయన బంజారా సమాజానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మరిపెడ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిపై సమగ్ర వీడియో డాక్యుమెంటరీని మాజీ మంత్రి డీఎస్ రెడ్యా నాయక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావుతో కలిసి రాకేష్ రెడ్డి విడుదల చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 బోగస్ హామీలతో ప్రజలను మోసగించిన తీరు, మరిపెడను మున్సిపాలిటీని మురికికూపంగా మార్చిన కాంగ్రెస్ డొల్లతనం బట్టబయలు చేసే డాక్యుమెంటరీని అద్భుతంగా తీర్చిదిద్దం జరిగిందన్నారు. మరిపెడను మున్సిపాలిటీ చేసి రికార్డ్ సమయంలో ద్వితీయ శ్రేణి నగరాల్లో ఒకటిగా అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలన్నారు.



# ఉత్సాహంగా 'సీఎం కప్'

- నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు పూర్తి
- విజేతలకు బహుమతుల ప్రధానం

**వరంగల్ వాయిస్, దామెర:** గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ రెండో ఎడిషన్ పోటీలు పరకాల నియోజకవర్గ స్థాయిలో శనివారం అత్యంత ఉత్సాహభరితంగా ముగిశాయి. దామెర మండల కేంద్రంలోని డిస్నీల్యాండ్ హై స్కూల్ వేదికగా ఈ పోటీలు నిర్వహించబడ్డాయి. పరకాల, నడికూడ, దామెర, ఆత్మకూర్, గీసుకొండ, సంగం మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. గ్రామీణ, మండల స్థాయిలో ప్రతిభ చాటి ఎంపికైన సుమారు 600 మంది అబ్బాయిలు, అమ్మాయిలు నియోజకవర్గ స్థాయి పోటీల్లో తమ సత్తా చాటారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ మరియు అథ్లెటిక్స్ వంటి వివిధ క్రీడాంశాలలో పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఆత్మకూర్ ఎమ్మార్వో, దామెర మండల విద్యాశాఖ అధికారి రాజేష్ నాయక్, ఆరు మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు, డిస్నీల్యాండ్ పాఠశాల కరస్పాండెంట్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# మూడో రోజు ఆదాయం రూ.2.01కోట్లు

### కొనసాగుతున్న మేడారం హుండీల లెక్కింపు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మేడారం హుండీల ద్వారా మూడోరోజు శనివారం రూ.2,01,21,440 ఆదాయం లభించినట్లు శ్రీ మేడారం సమ్మక్క-సాలమ్మ జాతర కార్యనిర్వహణ అధికారి వీరస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మూడు రోజుల్లో మొత్తం 425 హుండీలను లెక్కించగా రూ.8,06,46,359 ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం వచ్చిన విదేశీ కరెన్సీని మార్పించగా రూ.71,283 వచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన మేడారం జాతరలో సమ్మక్క గద్దెల ప్రాంతంలో 309, సారలమ్మ గద్దెల ప్రాంగణంలో 309, గోవిందరాజుల గద్దె ప్రాంతంలో 81, పగిడిద్దరాజు గద్దె ప్రాంతంలో 81 హుండీలతో పాటు 45 గుడ్డ హుండీలు, మూడు ఒడి బియ్యం హుండీలు ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు.

# ప్రతి ఒక్కరూ శ్రమదానంలో పాల్గొనాలి

### □ గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రతి ఒక్కరూ శ్రమదానంలో చురుకుగా పాల్గొని తమ చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న మేరా యువ భారత్ కార్యక్రమంలో భాగంగా అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళనం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ కోఆర్డినేటర్ అన్వేష్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, జీడబ్ల్యూఎంసీ అధికారులు, ఇతర శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.





# స్కూల్ బస్సులో మంటలు

### తృటిలో తప్పిన పెను ప్రమాదం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగే గ్రామం సమీపంలో శనివారం సాయంత్రం ఒక ప్రైవేట్ స్కూల్ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. స్థానిక రైజింగ్ సన్ పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను వారి ఇళ్ల వద్ద దించేందుకు వెలుతున్న క్రమంలో జూకల్ కెనాల్ బ్రిడ్జిపై బస్సులో మంటలు చెలరేగాయి. వంతెనపై బస్సు ప్రమాదకర స్థితిలో నిలిచిపోయింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే అందులో ఉన్న 15 మంది విద్యార్థులను కిందికి దించారు. డ్రైవర్ అప్రమత్తతోనే పెను ప్రమాదం తప్పిందని భావిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

**- వరంగల్ వాయిస్, చిట్యాల (భూపాలపల్లి)**

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com